క్లుప్తంగా

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి



నేర చరిత్ర కలిగిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు (టౌన్): రౌడీషీటర్లు నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కర్నూలు పోలీసులు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు.. జిల్లాలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్లలో రౌడీ షీటర్లకు, నేర చరిత్ర ఉన్న వారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అధిక రక్తపోటు ఆరోగ్యానికి చేటు



డాక్టర్ ఎ.వసంతకుమార్‌ను సన్మానిస్తున్న డాక్టర్ పి.చంద్రశేఖర్, సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): అధిక రక్తపోటు అదుపులో లేకుంటే ప్రమాదకరమని సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ ఎ.వసంతకుమార్ చెప్పారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధిక రక్తపోటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎ.వసంతకుమార్ మాట్లాడుతూ.. ఆధునిక అల్లోపతి మందులతో అధిక రక్తపోటు నియంత్రణలో ఉంచుతున్నట్లు తెలిపారు. తీవ్రమైన మానసిక ఒత్తిడి, స్థూల కాయం, వ్యాయామం లేకపోవడం, ఆహారపు అలవాట్ల వల్ల అధిక రక్తపోటు బాధితులు పెరుగుతున్నట్లు చెప్పారు. ఆహారంలో ఉప్పు తగ్గించుకుని ప్రతిరోజూ వ్యాయామం చేయడం, కొవ్వు, నూనె ఎక్కువగా ఉన్న పదార్థాలను తినడం తగ్గించాలన్నారు. అధిక రక్తపోటు వల్ల పక్షవాతం, గుండెపోటు, రక్తనాళాలు దెబ్బతినడం వల్ల ప్రాణాంతకం అవుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యకర జీవితాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ఆయన్ను కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు డాక్టర్ భవానీప్రసాద్, కల్కూర చంద్రశేఖర్, సభ్యులు ఘనంగా సన్మానించారు.

పల్లె సీమల జీవనాడి జానపదం



కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): జానపద గీతాలు, సంగీతం పల్లె సీమల ప్రజల జీవనాడి అని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. వారం వారం సంస్కృతంలో భాగంగా ఆదివారం రాత్రి తెలంగాణ, రాయలసీమ జానపద కళాకారులచే సంగీత విభావరి జరిగింది. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమంలో పాల్గొన్న జానపద కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా పత్తిఓబులయ్య మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం టీజీవీ కళాక్షేత్రంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని, కుటుంబ సమేతంగా నగర ప్రజలు వచ్చి ప్రదర్శనను చూసి ఆనందించాలని కోరారు. ఇప్పటికీ పల్లెటూర్లలో పాట పద్యానికి విపరీతమైన ఆదరణ ఉందన్నారు. ఈ కార్యక్రమానికి మహమ్మద్‌మియ్యా, ఇనాయతుల్లా వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. బీసీ సంఘం నాయకులు నక్కలమిట్ట శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు దస్తగిరి, రిటైర్డ్ సీఐ సత్యం, వైస్ ప్రెసిడెంట్ సివిరెడ్డి, మున్సిపల్ మేనేజర్ చిన్నరాముడు, కేవీ రమణ పాల్గొన్నారు. అనంతరం జానపద కళాకారులు ఆలూరి రాజా, అఖిల విష్ణు, నరసింహులు, మహేందర్, గంగాధర్‌లను టీజీవీ కళాక్షేత్రం తరఫున సత్కరించి పారితోషికం రూ.35 వేలు అందజేశారు. ఆటపాటలతో జానపద వేషధారణలో కళాకారులు పాటలు పాడి ప్రేక్షకులను అలరించారు.

'స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిద్దాం'

కల్లూరు: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిద్దామని సీపీఎం నగర నాయకులు యేసు పిలుపునిచ్చారు. ఆదివారం కల్లూరు అర్బన్ 30వ వార్డు శరీన్‌నగర్‌లో స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంచారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఈ నెల 14న నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు మౌలాలి, ప్రభాకర్, గోవిందు, నూర్ బాషా, కేవీపీఎస్ నాయకులు పెద్ద మధు తదితరులు పాల్గొన్నారు.

పేరెంట్స్ మీటింగ్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో జూలై 10వ తేదీన నిర్వహించే పేరెంట్స్ టీచర్స్ మీట్ (పీటీఎం) 2.0 ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కలెక్టర్ పీటీఎం 2.0 నిర్వహణపై డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, పాఠశాలల హెచ్‌ఎంలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యాశాఖాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పీటీఎంలో విద్యార్థులతో స్వయంగా ఆహ్వాన పత్రాలు తయా రుచేయించి వారి తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థు లు, ప్రజాప్రతినిధులు ఆహ్వానించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత పాఠశాలలు, కళాశాల ల్లో చదివి షైనింగ్ అవార్డు తీసుకున్న విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. విద్యార్థికి సంబంధించి సమ గ్ర పురోగతి కార్డును తల్లిదండ్రులకు అందించాలన్నారు. పాఠశాల నిర్వహణ తీరు, కార్యాచరణ ప్రణాళికలపై చర్చించాలని, తల్లిదండ్రుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. తల్లులకు రంగువళ్లల పోటీలు, మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్ వంటి సరదా ఆటలను నిర్వహించి ఉత్సాహం పెంచాలని సూచించారు. తల్లి పేరుతో విద్యార్థులచే మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. మధ్యాహ్నం ప్రత్యేక వంటకాలతో భోజనం అందించాలని సూచించారు. జేసీ డాక్టర్ బి.నవ్య, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఈఓ శామ్యూల్‌పాల్, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం అనర్హత జాబితాపై ఆర్డీఓలతో విచారణ

పాఠశాలల వారీగా తల్లికి వందనం అనర్హుల జాబితాపై మూడు రోజుల్లో విచారణ చేసి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆర్డీఓలను ఆదేశించారు. ఈ విచారణ అధికారుల్లో ఆయా మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంఈఓలు ఉంటారని, వారంతా పాఠశాల వారీగా జాబితాలను తీసుకొని అనర్హుల జాబితాపై మరోసారి పరిశీలన చేసి కారణాలను విశ్లేషించి ఎక్కడైనా పరిష్కరించే అవకాశం ఉంటే సరిచేయాలని సూచించారు. కాగా, తల్లికి వందనం జాబితాలో అనేక పొరపాట్లు ఉన్నాయని స్వయంగా కలెక్టర్ ఒప్పుకొని విచారణకు ఆదేశించడం గమనార్హం.

రోడ్డుపై నిలిచిన నీరు



వీకర్ సెక్షన్ కాలనీలో రోడ్డుపై నిలిచిన నీరు

కల్లూరు: కల్లూరు అర్బన్ వీకర్ సెక్షన్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో రోడ్డు మధ్యలో నీరు నిలిచింది. దీంతో రోడ్డు సైడ్లకు బురద మయంగా మారుతోంది. రోడ్డుపై నిలిచిన నీరు దోమలు, లార్వాలు, ఈగలకు నెలవుగా మారిందని స్థానికులు వాపోతున్నారు. వాతావరణ మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు





మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాసులు, పెంపుడు కుక్కకు యాంటీ రేబిస్ టీకా వేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): జంతువుల నుంచి సోకే వ్యాధుల పట్ల అవగాహన పెంచుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. ప్రతి ఒక్కరు కుక్కలు, పిల్లులు, గొర్రెలు–మేకలు ఇతర జంతువుల పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకొని కర్నూలులోని బహుళార్థ పశు వైద్యశాల, అన్ని ఏరియా పశు వైద్యశాలల్లో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేసే కార్యక్రమం చేపట్టారు. బహుళార్థ పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ ప్రారంభించారు. పెంపుడు జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులపై ఆయన అవగాహన కల్పించారు. 65 పెంపుడు కుక్కలు, పిల్లులకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధుల్లో ప్రమదకరమైంది రేబిస్ అని, దీనికి చికిత్స లేదని నివారణ ప్రధానమని పేర్కొన్నారు. వీధి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బహుళార్థ పశువైద్యశాల, ఏరియా పశు వైద్యశాలలకు జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం 13 వేల డోసుల రేబిస్ వ్యాక్సిన్‌ను సరఫరా చేసినట్లు చెప్పారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ రాజశేఖర్, డీడీ దుర్గాప్రసన్నబాబు, డాక్టర్ రామచంద్ర, సుధాకర్, గిడ్డయ్య, సుధాకర్‌రెడ్డి, రవిప్రకాశ్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పొంగిపొర్లుతున్న తుంగభద్ర నది

తుంగభద్ర పరవళ్లు

సుంకేసుల నుంచి నీటిని విడుదల చేయడంతో తుంగభద్ర నదికి జలకళ సంతరించుకుంది. కర్నూలు మీదుగా వెళ్తున్న తుంగభద్ర నదిలో భారీగా నీరు చేరడంతో చూపరులకు కనువిందుగా మారింది. మరోవైపు తుంగభద్ర కృష్ణమ్మ ఒడిలో చేరేందుకు ఉరకలెత్తుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

బంద్‌ను జయప్రదం చేయండి

కర్నూలు(న్యూటౌన్): కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్‌లు, రవాణా రంగ చట్టాల్లో మార్పులను వ్యతిరేకిస్తూ ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఆటో కార్మికులు పాల్గొనవలసిందిగా కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు ఆదివారం రాజ్‌విహార్ సెంటర్‌లో కరపత్రాలను విడుదల చేసి ఆటోలకు అతికించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, ఏఐటీయూసీ ఆటో కార్మిక సంఘం నగర కార్యదర్శి కృష్ణారెడ్డి, ఏఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ.. రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే మోటార్ వాహన చట్టం 2021, భారత న్యాయ సంహిత సెక్షన్ 106 (1, 2)లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లైసెన్స్, రెన్యూవల్, రిజిస్ట్రేషన్, వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఆర్టీఓ కార్యాలయం ద్వారా జరగాలని కోరారు. చిన్న టేకూరు వద్ద ఏర్పాటు చేసిన ప్రైవేట్ ఫిట్నెస్ సెంటర్లను రద్దు చేయాలన్నారు. ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, నగర కార్యదర్శులు నాగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ప్రకటనలకే పరిమితమైన ప్రభుత్వ పథకాలు



ఏకలవ్యుని జయంతిలో పాల్గొన్న టీఎస్‌ఎఫ్ నేతలు

కర్నూలు(అర్బన్): దశాబ్దాలుగా ఎరుకలి సామాజిక వర్గానికి చెందిన ప్రజలు పూర్తి స్థాయిలో నిరాదరణకు గురవుతున్నారని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నాయే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదన్నారు. ఆదివారం టీఎస్‌ఎఫ్ కార్యాలయ ఆవరణలో ఏకలవ్య జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రప్ప మాట్లాడుతూ.. అంకిత భావంతో విలువిద్యను నేర్చుకున్న ఏకలవ్యుడు గురుభక్తితో తన కుడి చేతి బొటన వేలిని కోసి ఇచ్చారన్నారు. గురు భక్తి, అంకితభావం, ఏకాగ్రత, త్యాగానికి ఏకలవ్యుడు మారుపేరుగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఏకలవ్యుని వారసులుగా ఉన్న ఎరుకలి సామాజిక వర్గానికి చెందిన ప్రజల అభివృద్ధి కోసం పాలక ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఎరుకలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి అన్ని రంగాల్లో వారు అభివృద్ధి చెందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. టీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామరాజు, వెంకటేష్, నాయకులు రామక్రిష్ణ, సాయికిరణ్, ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ గొప్పతనం




మాట్లాడుతున్న డాక్టర్ మురళీధర్

కర్నూలు(హాస్పిటల్): భిన్నత్వంలో ఏకత్వం ఉండే గొప్ప దేశం భారత్ అని, దేశంలో ప్రతి పౌరుడు భద్రంగా ఉండాలంటే గాంధీ, అంబేడ్కర్, మార్క్స్ భావజాలాలు నేటి సమాజానికి ఏ విధంగా ఉపయోగపడతాయో పరిశోధన చేసి ఉపయోగించుకోవాలని తెలంగాణ జనవిజ్ఞాన వేదిక సీనియర్ నాయకుడు డాక్టర్ ఎల్.మురళీధర్ సూచించారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్‌లో ఆదివారం జనవిజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ.. ఆధునిక సమాజంలో మూఢ నమ్మకాలు ఇంకెంతకాలమని, ఇకనైనా సైన్స్ పరిశోధనలకు ప్రభుత్వాలు నిధులు కేటాయించి ప్రోత్సహించాలన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. సైన్స్‌ను ఉపయోగించుకునే మూఢ నమ్మకాలను ప్రచారం చేస్తున్నారని వాపోయారు. జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమలో సాగు, తాగునీటి సమస్య ఉందని, ప్రతి పౌరుడు సీమ నీటి విషయంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. లేకపోతే రాబోయే కాలంలో తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని, ఇప్పటికే పశ్చిమ ప్రాంత ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి, క్లస్టర్ వర్సిటీ డీన్ డాక్టర్ అక్తర్‌బాను, డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదినారాయణరెడ్డి, జనవిజ్ఞాన వేదిక నాయకులు అరుణ, మహమ్మద్ మియ్యా, నాగరాజు, ప్రతాపరెడ్డి, శేషాద్రిరెడ్డి, సుదీర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు



ఇస్కాన్‌లో ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులు



ప్రత్యేక అలంకారణలో సూర్యనారాయణ స్వామి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



లలితా పీఠంలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



గీతా ప్రచార ధామంలో భగవద్గీత పారాయణం





సంకల్‌బాగ్ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో తొలి ఏకాదశి పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్య నారాయణ స్వామి ఉత్సవ మూర్తులకు ప్రాతఃకాలంలో భక్తులచే అష్టోత్తర శత కలశాభిషేకం చేశారు. సూర్య భగవానుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు టీఎస్ రామకృష్ణ, డాక్టర్ సి.ఆంజనేయులు, డాక్టర్ సీఏ నగేష్ వర్మ, డాక్టర్ వై.కృష్ణమోహన్, మాతృమండలి సభ్యులు సీఏ రాజేశ్వరి, డాక్టర్ వై.నాగజ్యోతి, శైలజ, సుదర్శన్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు అన్నారు. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో తొలి ఏకాదశి వేడుకలు, భగవద్గీత శిక్షణ తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు నిర్వహించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులను వేంకటేశ్వర స్వామి రూపంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా రఘునందన సేవక్ ప్రభు సందేశమిచ్చారు. భగవంతుడిని ధ్యానిస్తూ ఆలయాల దర్శనం చేసుకోవాలన్నారు. భగవద్గీతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరు భగవద్గీత గురించి తెలుసుకోవాలని పఠనం, శ్రవణం చేయాలన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: తొలి ఏకాదశి పురస్కరించుకొని వైష్ణవాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. సంకల్‌బాగ్, కృష్ణానగర్, వీఆర్ కాలనీ, వాసవీ నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయాలు, ఓల్డ్‌సిటీ లలితా పీఠం, అరోరా నగర్ రాజరాజేశ్వరి ఆలయం, గోశాల, గోదా గోకులంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో సంపూర్ణ భగవద్గీత పారాయణం జరిగింది. గోమాత పూజ, శ్రీకృష్ణుడికి అభిషేకం, విశేషాలంకరణ కార్యక్రమాలు జరిగాయి. గుంటూరు జిల్లా నంబూరు కాశీవన ఆశ్రమం పౌరాణిక ప్రవచకులు హైందవ శ్రేష్ఠ పురస్కార గ్రహీత శ్రీనివాస రామానుజదాసు ప్రవచనం చెప్పారు. జీవిత తత్వదర్శిని భగవద్గీత అన్నారు. గీత మృత్యు భయాన్ని తొలగించి అమృత తత్వాన్ని కలిగిస్తుందన్నారు. ఈనాటి సమాజానికి భగవద్గీతను పరిచయం చేసి విస్తృత వ్యాప్తికి అందరూ ముందుకు రావాలన్నారు. సంఘం అధ్యక్షుడు డీవీ రమణ, ధార్మిక ప్రవచకులు కల్లే వేణుగోపాల్ శర్మ, సంఘం సభ్యులు ఇల్లూరు వెంకటరమణ, సింహాద్రి రమేష్, జగన్మోహన్, మహాబలేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సమస్యకు నిర్దేశిత గడువులోపు పరిష్కారం లభిస్తుందని, పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు https://meekosam.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

బాబు జగ్జీవన్ రామ్‌కు నివాళి

కర్నూలు(సెంట్రల్): మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్‌కు కాంగ్రెస్ పార్టీ ఘన నివాళులర్పించింది. ఆదివారం ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని డీసీసీ కార్యాలయంలో మాజీ జిల్లా అధ్యక్షుడు సుధాకరబాబు నేతృత్వంలో నిర్వహించారు. ముందుగా బాబుజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్ఎస్ రోడ్డులోని ఆయన కాంస్య విగ్రహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నాయకులు దామోదరం రాధాకృష్ణ, సయ్యద్ ఖాద్రిపాషా, బజారన్న, ఖాజా హుస్సేన్, ఎజాజ్ అహ్మద్, ఆర్.ప్రతాప్, బి.సుబ్రమణ్యం, సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులను సస్పెండ్ చేయాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో జరిగిన రూ.95 లక్షల కుంభకోణానికి సంబంధించి బాధ్యులైన జిల్లా వ్యవసాయాధికారులను తక్షణమే సస్పెండ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 2016 నుంచి 2019 వరకు సంబంధించిన జాతీయ ఆహార భద్రత మిషన్ నిధులు రూ.95 లక్షలను అప్పటి జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఠాగూర్‌నాయక్ స్వాహా చేశారని, బోగస్ సంస్థ పేరుతో రాజేష్ అనే వ్యక్తి నిధులను కట్టబెట్టారని ఆరోపించారు. అయితే నిధులను మింగిన అధికారులను సస్పెండ్ చేయకుండా కిందిస్థాయి వారిని సస్పెండ్ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులను రోడ్డున పడేసిన ప్రభుత్వం



మాట్లాడుతున్న రాఘవేంద్ర

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను రోడ్డున పడేసిందని, ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చడం లేదని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర విమర్శించారు. ఆదివారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఓల్డ్‌సిటీ నగర కమిటీ డీవైఎఫ్ఐ మహాసభలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన రాఘవేంద్ర, జిల్లా నాయకులు అబ్దుల్లా మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మూడు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, 20 లక్షల ప్రైవేట్ ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన సీఎం చంద్రబాబునాయుడు నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఎప్పుడు ఇస్తారో చెప్పడం లేదన్నారు. వెంటనే ఏపీపీఎస్సీ ద్వారా జాబ్ క్యాలెండర్ విడుదల చేయించాలని మంత్రి లోకేష్‌ను కోరారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా అంజి, మధు, సభ్యులుగా రాజు, జుబేర్, ఇర్ఫాన్, ఖాదర్, నూర్, చంద్ర, గోపి, అలీ, అక్బర్, శంకర్, ఖాదర్, ఖలీని ఎన్నుకున్నారు.


పత్తిలో సస్యరక్షణ పద్ధతులపై అవగాహన



మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ప్రధానంగా పత్తి పంటకు సోకే గులాబి రంగు పురుగు యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకొని రైతులకు చక్కటి సలహాలు, సూచనలు ఇవ్వాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో దేశీ డిప్లొమా కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పత్తి పంటకు గులాబి రంగు పురుగు ఎక్కువ నష్టం కలిగిస్తుందన్నారు. పురుగుల ఉధృతిని తెలుసుకునేందుకు ఎకరానికి ఐదు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పత్తిలో అంతరపంటలుగా పెసర, మినుము, సోయాచిక్కుడు వేసుకొని మిత్ర పురుగులను అభివృద్ధి చేసుకుంటే ప్రధాన పంటకు హాని కలిగించే పురుగులను నివారించుకోవచ్చని వివరించారు. సింథటిక్ పైరత్రాయిడ్ పంట 80 రోజులలోపు వాడరాదని, బెట్ట పరిస్థితులు ఉన్నపుడు అంతర సేద్యం చేయాలని, పోటాషియం నైట్రేటు 2 శాతం పిచికారీ చేయాలన్నారు. విశ్రాంత జేడీఏ, దేశీ డిప్లొమా కోర్సు సమన్వయ కర్త జయచంద్ర మాట్లాడుతూ.. యూరియా మోతాదుకు మించి వేయడం వల్ల మిత్ర పురుగులు తగ్గి రసం పీల్చే పురుగుల తీవ్రత పెరుగుతుందన్నారు. పత్తిలో పూత, మొగ్గ రాలినపుడు ఎన్ఏఏ 10 పీపీఎం, బోరాక్స్ పిచికారీ చేయాలన్నారు. పలువురు ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాల పంపిణీ



ఇందిరాగాంధీ నగర్‌లో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): స్మార్ట్ కరెంట్ మీటర్లను బిగించరాదని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటా కరపత్రాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్‌లో సీపీఎం నాయకులు టి.రాముడు, పీఎస్ రాధాకృష్ణ, 32వ వార్డు ముజఫర్ నగర్‌లో ఆర్.నరసింహులు, కె.సుధాకరప్ప, ఎంసీ ఆనంద్ ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాత మీటర్లు ఉండగా కొత్తగా స్మార్ట్ మీటర్లు ఎందుకని ప్రశ్నించారు. కేవలం ఆదానీ కోసం స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని, వాటితో కరెంట్ బిల్లులు విపరీతంగా పెరిగిపోతాయన్నారు. మంత్రి లోకేష్ కనుసైగతో ప్రభుత్వాన్ని శాసిస్తున్నారని, గతంలో ఆయన పాదయాత్రలో స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలగొట్టాలని చెప్పి ఇప్పుడేమో మిన్నకుండిపోవడం అన్యాయమన్నారు. వెంటనే లోకేష్ కలుగజేసుకొని కూటమి ప్రభుత్వం బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని డిమాండ్ చేశారు.